క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



చాగల్లులో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చాగల్లు: స్థానిక శివాలయం సమీపంలో వేంచేసిన షిర్డీ సాయి మందిర వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలశ స్థాపన, బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అష్టద్రవ్య లక్ష్మీగణపతి హోమం, సాయి భక్తులతో సామూహిక విష్ణు సహస్ర పారాయణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లస్టర్ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

నల్లజర్ల: పాఠశాల విద్యా శాఖలో కీలకమైన స్కూల్ కాంప్లెక్స్‌ల స్థానంలో ప్రభుత్వం క్లస్టర్ విధానం శనివారం నుంచి మొదలుపెట్టింది. పోతవరం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన క్లస్టర్ సమావేశానికి ఎంఈఓ–1 వై.సత్యనారాయణ హాజరై ఉపాధ్యాయులతో మాట్లాడారు. అకడమిక్ స్టాండర్డ్ పెంపొందిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి నెలా మూడో శనివారం క్లస్టర్ సమావేశాలు జరుగుతాయన్నారు. సీఆర్పీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతపల్లి, నల్లజర్ల, దూబచర్ల క్లస్టర్లలో కూడా సమావేశాలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



చిక్కాల చెరువు గట్టుపై ఏర్పాటుచేసిన అభయాంజనేయస్వామి విగ్రహం

చాగల్లు: మండలంలోని చిక్కాల చెరువు గట్టున ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం కన్నులపండువగా జరిగింది. బుధవారం స్వామివారి ఊరేగింపుతో ప్రారంభమైన మహోత్సవాలు శనివారం అన్నసమారాధనతో ముగిశాయి. ఈ సందర్భంగా గోపూజ, గణపతి పూజ, మండపార్చన, మూల మంత్ర జపం, లక్ష్మీగణపతి హోమం, వేద విద్యార్థులతో వేద పఠనం, తదితర పూజలు నిర్వహించారు. యంత్రస్థాపన, శిలావిగ్రహ ప్రతిష్ఠ, 18 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ విష్కరణ చేశారు. పండితులు స్వామివారికి విశేష పూజలు చేసి, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక నాయకులు నాదెళ్ల శ్రీరామ్, పి.చౌదరి, వై.అబ్బులు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం: పాలంగిలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయ ఎదుట శనివారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి దుర్గేష్‌కు దేవస్థానం ఏవో ఎంవీ.రామయ్య, వేద పండితులు ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి దంపతులు, సర్పంచ్ బొక్కా శ్రీనివాసు దంపతులు, ఆరిమిల్లి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

నిడదవోలు రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలిపించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రచారం చేశారు. సమిశ్రగూడెం విజ్ఞాన్–వికాస్ కళాశాలలో ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు. అట్లపాడులో అలువేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

శుభ్రత.. ఆరోగ్య భద్రత



అన్నదేవరపేటలో ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

- స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ ర్యాలీలు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, పాఠశాల విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, చెత్తల సేకరణపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ షేక్‌సూర్జాన్, ఎస్ఈజీఎస్ఏపీవో రమాదేవి, పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, సిబ్బంది సీహెచ్ రామారావు, ఎంఆర్‌సీ కేవీ రవిప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

కొవ్వూరు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామ్మోహన్‌రావు అన్నారు. స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది ప్రాంగణంలో చెత్త, వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, పీజీ డైరెక్టర్ చలపతిరావు, దయాకర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నిడదవోలు రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ అన్నారు. స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సమిశ్రగూడెం అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను శనివారం శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉద్యోగులంతా తమ కార్యాలయ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సచివాలయ, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. స్థానిక సంపద కేంద్రం వద్ద పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ డి.రాజారావు, పరిపాలనాధికారి జి.శాంతి, ఉపాధి హామీ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది



కొవ్వూరులో కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నిడదవోలు : ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి డాక్టర్ ఇ.తేజశ్రీ సూచించారు. పట్టణంలో నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాలనీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యాక్రమాన్ని చేపట్టారు. వైద్య సిబ్బంది, స్థానికులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ ఇంటి పరిసరాలతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి రోగాలు దరి చేరకుండా ఆరోగ్యవంతమైన వాతావరణం ఉంటుందన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారి తేజశ్రీ, వైద్య సిబ్బంది



దేవరపల్లిలో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ దుర్గారావు, సిబ్బంది

‘అంగన్‌వాడీ’లను అభ్యాస కేంద్రాలుగా మార్చాలి

- ఐసీడీఎస్ పర్యవేక్షకులు విజయలక్ష్మి
- సిబ్బందికి ముగిసిన శిక్షణ

దేవరపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను అభ్యాస కేంద్రాలుగా మార్చాలని ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు ఎం.విజయలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. పోషణ భీ పడాయి భీ కార్యక్రమంపై మండలంలోని 79 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల పర్యవేక్షకులు విజయలక్ష్మి, ఎం.శశికళ, బి.విజయశాంతి శిక్షణ ఇచ్చారు. దివ్యాగ పిల్లలకు స్క్రీనింగ్ చేరిక, వ్యూహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని అభివృద్ధి ఆటంకాలు, వైకల్యాలు ఉన్న వారిని ముందస్తుగా గుర్తించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ వర్కర్లకు ముగిసిన శిక్షణ

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ పక్వాడ్‌పై గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్యం తదితర అంశాలపై అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్లు భాగ్యకుమారి, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: అంగన్‌వాడీ చిన్నారుల్లో శారీరక, మానసిక అభివృద్ధిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.పద్మావతి, జి.శిరీష సూచించారు. చాగల్లు, మార్కొండపాడు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. చక్కని బోధన పద్ధతులతో చిన్నారులకు బోధించాలని సూచించారు.



యర్నగూడెంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

చిన్నారుల పెరుగుదలలో వ్యత్యాసాన్ని గుర్తించాలి

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ఎత్తు, బరువు, పెరుగుదలలో వ్యత్యాసం గుర్తించాలని ఐసీడీఎస్ గోపాలపురం ప్రాజెక్ట్ అధికారిణి నాగలక్ష్మి సూచించారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని కార్యకర్తలకు పలు సూచనలిచ్చారు. పిల్లలకు అవసరమైన పోషణపై దృష్టి సారించాలన్నారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్గించాలన్నారు. ఏసీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, పోతవరంలో హారతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమగ్ర పోషణ కేంద్రాలు

నిడదవోలు రూరల్: అంగన్‌వాడీలు సమగ్ర పోషణ కేందాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పోషన్ బీ–పఢాయి బీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఐసీడీఎస్ సెక్టర్ సూపర్‌వైజర్ పి.నళిని అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం, తాడిమళ్ల ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక లోపాలకు కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తెలియజేశారు. ఈకార్యక్రమంలో నిడదవోలు సెక్టర్ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



చాగల్లులో అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ నాగలక్ష్మి

కరెంట్ కోతలు.. ప్రజల పాట్లు



పెరవలి సబ్ స్టేషన్

- పగలు అధికారికంగా, రాత్రిళ్లు అనధికారంగా కోతలు
- ఇబ్బంది పడుతున్న జనం

పెరవలి: విద్యుత్ లైన్ల మరమ్మతుల పేరుతో పగలు అధికారిక కోతలు విధిస్తున్నారు. రాత్రిళ్లు అనధికారికంగా సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కరెంట్ లేకపోవడంతో ఫ్యాన్లు తిరగక గాలాడక జనం విలవిల్లాడిపోతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు తీస్తారో తెలియక నానా పాట్లు పడుతున్నారు. కరెంటు కోతలపై సమాచారం కోసం ఫోన్లు చేస్తే సమాధానం చెప్పే నాథులే కరువయ్యారు. మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనలు ఉన్నప్పుడు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉంటుందని, ఇతర సమయాల్లో మాత్రం యథావిధిగా కోతలు తప్పటం లేదని తీవ్రంగా విమర్శిస్తున్నారు. మరమ్మతుల పేరుతో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ప్రకటన ఇస్తారు కానీ అది కాస్త 2, 3 గంటలకు విద్యుత్ సరఫరా ఇస్తున్నారని దీని వలన పనలు నిలిచిపోతున్నాయని కార్మికులు, పౌంల్ట్రీ యజమానులు, హోటళ్ల నిర్వాహకులు, నూనె, కారం, పిండి మిల్లులు యజమానులు గగ్గోలు పెడుతున్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు చాలా నిర్లక్ష్యంగా ఉంటున్నారని ప్రధాన లైన్‌వైర్ తెగిపోతే సాయంత్రం వరకు విద్యుత్ పునరుద్ధరణ చేయలేదని దీని వలన చాలా ఇబ్బందులు పడ్డామని పత్రికా ముఖంగా తెలిపినా పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. పెరవలి మండలంలో గత నెల రోజులుగా మరమ్మతుల పేరు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. రాత్రి సమయాల్లో 11 గంటల నుంచి వేకువజాము 3 గంటల వరకూ ఉండడం లేదని ప్రజలు చెప్పుచున్నారు. ప్రస్తుతం ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే వేసవిలో అసలు విద్యుత్ సరఫరా ఉంటుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సమస్యలు తలెత్తితే తప్ప కోతలు లేవు

దీనిపై పెరవలి ఏఈ డేవిడ్ నిశ్చల్‌ను వివరణ కోరగా కరెంటు కోతలు ఏమీ లేవని ఎప్పుడైనా విద్యుత్ లైన్‌లో సమస్యలు తలెత్తితే తప్ప విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయమని, అదే విధంగా విద్యుత్ మరమ్మతు పనులు ఉన్నప్పుడు సరఫరా మాత్రమే నిలుపుదల చేస్తున్నామని తెలిపారు.

టీచర్‌కు టెక్నాలజీ ప్రత్యామ్నాయం కాదు

కంబాలచెరువు: విద్యార్థులకు ఉపాధ్యాయుల ద్వారానే బోధన సాధ్యం అని, టెక్నాలజీ ఎంత వచ్చినా టీచర్‌కు ప్రత్యామ్నాయం కాలేదని రాష్ట్ర విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహం అన్నారు. స్థానిక లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్‌పై దృష్టి సారించాలని, బడిఈడు పిల్లలందరూ విధిగా పాఠశాలలోనే ఉండాలన్నారు. ఉపాధ్యాయులు బోధనలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆసక్తికరంగా తరగతి గదిని రూపొందించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్ సెషన్‌లో కమిషనర్ సూచనలు వెబెక్స్ ద్వారా విన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు మాట్లాడుతూ మన ప్రభుత్వ పాఠశాలలకు ఎక్కువగా పేద పిల్లలే వస్తారని, వారి అభ్యున్నతికి పాటుపడాలన్నారు.క్లస్టర్ సమావేశాలు ప్రతి నెలా మూడో శనివారం ఒకరోజు మాత్రమే జరుగుతాయని, ఒకవేళ ఆ రోజు సెలవు అయితే నాలుగో శనివారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ అబ్రహం

23న సహస్ర గళ పారాయణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): టి.నగర్‌లోని హిందూ సమాజంలో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి సహస్ర గళ పారాయణ నిర్వహించనున్నారు. స్థానిక కన్వీనర్ మిర్తిపాటి వెంకట రామయ్య ఈ విషయాన్ని శనివారం ప్రకటనలో తెలిపారు. కల్వకొలను చిత్త రంజాన్ దాస్ స్మారక సేవాసంస్థకు అనుబంధ సంస్థ అయిన సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం ఈ కార్యక్రమం జరుపుతున్నామన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి

ప్రకాశం నగర్: కూటమి ప్రభుత్వంపై ఎనిమిది నెలల్లోనే ప్రజలకు అసంతృప్తి నెలకొందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. జట్ల లేబర్ యూనియన్ మేస్త్రీల సమావేశాన్ని యూనియన్ అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మధు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే పెట్టుబడులు పెరుగుతాయని, ప్రజలకు ఉపాధి కలుగుతుందన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందని, గత ఎన్నికల్లో ప్రచారం చేసిన చంద్రబాబుకు రాష్ట్రం అప్పుల్లో ఉన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలంటే కాకినాడ తీరంలోని గ్యాస్ చమురు నిక్షేపాల్లో మనకు రావాల్సిన వాటా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 23 న కాకినాడ గాంధీ భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించండి



తీపర్రులో సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ

పెరవలి: చెత్త నుంచి సంపద సృష్టించడానికే ప్రభుత్వాలు ఈ చెత్త సేకరణ షెడ్లు ఏర్పాటు చేసిందని దీనిని సద్వినియోగం చేసుకుని పంచాయతీలు ఆర్థికంగా బలపడాలని ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ తెలిపారు. మండలంలోని కానూరు, తీపర్రు గ్రామాల్లో సంపద కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 18 గ్రామాల్లో షెడ్లు ఏర్పాటు చేశారని, కొన్ని గ్రామాల్లో సంపద తీస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో ఎరువు తయారీ పనిలో ఉన్నారని తెలిపారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి బెడ్‌ల్లో వేసి ఎరువును తయారు చేస్తే తద్వారా సంపద సృష్టి అవుతుందన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి



తీపర్రులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు

పెరవలి: పేదలకు కేటాయించి గృహాలను నిర్మించుకోకపోతే అవి వెనక్కి తీసుకునే అవకాశం ఉందని, వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని లబ్ధిదారులకు హౌసింగ్ ఏఈ విక్టర్ బాబు తెలిపారు. తీపర్రు బీసీ కాలనీలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు డ్వాక్రా ద్వారా రుణాలు ఇస్తున్నామని, మెటీరియల్ తాము సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందని లబ్ధిదారులు దీనిని దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అనిల్ వినయ్, ఏపీఎం రామకృష్ణ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జాతీయస్థాయిలో నిర్వహించే ఉగాది పురస్కారాలకు శ్రీకృష్ణదేవరాయలు 18వ తరం వారసురాలు రాజమాత లలితారాణి శ్రీరంగదేవరాయలు రానున్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రాజయోనా ఈ విషయాన్ని ప్రకటనలో తెలిపారు. హంపిలో రాజమాత లలితారాణి శ్రీరంగదేవరాయలును శనివారం కలిసి, జ్ఞాపిక అందజేసి సత్కరించామన్నారు. అలాగే ఉగాది పురస్కారాలకు ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.

ముగిసిన ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్

ప్రకాశం నగర్: స్థానిక రైల్వే క్రీడా మైదానంలో భాష్యం స్కూల్ ఈస్ట్ –2 జోన్‌లోని ఏడు బ్రాంచ్‌ల మధ్య అట్టహాసంగా జరిగిన బాలుర ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. షటిల్, కబడ్డీ, రన్నింగ్, ఖోఖో, షాట్‌పుట్, క్యారమ్స్, చెస్ తదితర క్రీడల్లో జూనియర్, సీనియర్ విభాగాలలో హోరాహోరిగా పోటీలు జరిగాయి. ముగింపు కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ప్రకాశం నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ బాజీలాల్, భాష్యం జోనల్ ఇన్‌చార్జి వి.ఆంజనేయులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేశారు.